



పూసుగూడెం వద్ద సీతారామ పంపుహౌస్‌ను పరిశీలించి నీటిలో తడిచి ముద్దయిన తుమ్మల, ఎమ్మెల్యే జారే, ఇరిగేషన్ అధికారులు

గలగలా గోదారి తరలివచ్చే వేళ..

నేడు ఉమ్మడి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- పూసుగూడెం వద్ద సీతారామ పంప్‌హౌస్ ప్రారంభం
- వైరాలో రైతు బహిరంగ సభ
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు
- ఇదే సభలో రూ.2లక్షల లోపు రైతురుణమాఫీ పూర్తి
- 'సీతారామ'పై మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల
- ఉమ్మడి జిల్లాకు సీఎం వరాలపై ఆశలు



ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం, ఆగస్టు 14: ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. తలాపునే ప్రవహిస్తున్న గోదావరి ఇరు జిల్లాలను తాకి సస్యశ్యామలం చేయబోతోంది. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 'సీతారామ' ప్రాజెక్టు ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సీతారామ సాగునీటి ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు విడుదల చేయబోతున్నారు. రాజీవ్ లింక్‌కెనాల్‌తో గోదావరి జల్లాలను వైరా రిజర్వాయర్‌కు తరలించి ఎన్నెస్పీ ఆయకట్టుకు అందించనున్నారు. దాంతో జిల్లాలో కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం జరగబోతోంది. ఏపీలోని పట్టిసీమ మాదిరిగా ఖమ్మం జిల్లాలో ఏన్కూరు రాజీవ్‌కెనాల్ నిలవనుంది. రూ.8,500కోట్లతో గత ప్రభుత్వం చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకాన్ని సత్వరం (మిగతా 6వ పేజీలో)

'సీతారామ' ఎత్తిపోతల వివరాలిలా..

భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద దుమ్ముగూడెం ఆనకట్ట సమీపంలో గోదావరి నదిపై 2016 ఫిబ్రవరి 18న సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి అంకుర్పారణ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తొలుత రూ.7,926 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రతిపాదించారు. ఆ తర్వాత 2018 ఆగస్టు 2న మళ్లీ అంచనా వేసి రూ.13,57 కోట్లు ఖర్చవుతుందని నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 10లక్షల ఎకరాలు సాగులోకి వస్తుంది. గోదావరి నుంచి 70.40టీఎంసీల నీటిని తీసుకునేందుకు కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ప్రాజెక్టు కాలువ మొత్తం పొడువు 295.70కిలో మీటర్లు ఉంటుంది.

ఈ ప్రాజెక్టు కోసం మొత్తం నాలుగు పంప్‌హౌస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. అశ్వాపురం మండలంలో బీజీకొత్తూరులో ఒక పంప్‌హౌస్, ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లో రెండు పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం 22,370 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 8,899 ఎకరాలు సేకరించారు. ఇందులో నాన్‌ఫారెస్టు భూమి 17,374 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 5,116 ఎకరాల సేకరణ పూర్తయ్యింది. ఫారెస్టు లాండ్ కింద ఐదువేల ఎకరాలు అవసరం ఉండగా 3,783 ఎకరాలు సేకరించారు. ఈ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2లక్షల 509 ఎకరాలకు నీరందనుంది. ఖమ్మం జిల్లాలో 4.59 లక్షల ఎకరాల సాగుకు నీరు లభించనుంది. మహబూబాద్ జిల్లాలో 14,870 ఎకరాలు మాత్రమే సాగులోకి వస్తుంది.

ఈ మూడు జిల్లాలోని చెరువుల్లోకి ఈ ప్రాజెక్టు నుంచి నీటిని పంపిస్తే 48,904ఎకరాలకు సాగులోకి వస్తుంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మొదటి దశలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని మళ్లించి ఎన్నెస్పీ ఆయకట్టుకు అందించనున్నారు. దీంతో పాటుగా లంకాసాగర్ ప్రాజెక్టుకే నీటిని అనుసందానం చేస్తే మరో 1.20లక్షల ఎకరాలకు సాగులోకి వస్తుంది. జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు లింక్‌కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు సుమారు రూ.100కోట్ల వరకు ఖర్చవుతోంది.

నా చిరకాల కోరిక నెరవేరుతోంది

- కృష్ణా, గోదావరి జలాల అనుసంధానం ఉమ్మడి జిల్లాలో ఓ ప్రధాన ఘట్టం
- రైతు రుణమాఫీకి ఖమ్మం వేదిక కావడం సంతోషకరం
- ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు 'సీతారామ' ద్వారా గోదావరి జలాలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పూసుగూడెం పంప్‌హౌస్ వద్ద ఏర్పాట్ల పరిశీలన
- గోదావరి జలాల్లో తడిచి పులకించిన మంత్రి 6

సీఎం సభకు సర్వం సిద్ధం

- వరుణుడిపైనే భారం
- రైతులకు రెండు లక్షల రుణమాఫీ చెక్కులను పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 1,150 మంది పోలీసులతో భారీ బందోబస్తు 6



సిద్ధమైన సభావేదిక



ముస్తాబైన కొత్తగూడెం ప్రకాశం స్టేడియం

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు

- ప్రగతి మైదానంలో జెండా ఎగురవేయనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రకాశం స్టేడియంలో పాల్గొననున్న సింగరేణి సీఏండీ బలరాం

కొత్తగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రమైన కొత్త గూడెంలోని రామటాకీస్ ప్రాంతంలో ఉన్న ప్రగతిమైదా నంలో గురువారం ఉదయం 9 గంటలకు జరగనున్న 78వ స్వాతంత్ర్య వేడుకల్లో వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా ఉదయం 9.45గంటలకు ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ మేరకు ప్రగతి మైదానంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిది ద్దారు. తెలంగాణ పోరాటయోధులు, అమరవీరుల స్థూపాలను అలకరించారు. ప్రగతిమైదానంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. పోలీస్ బలగాలతో మైదానంలో కవాతు నిర్వ హించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించనున్నారు. పతాక ఆవిష్కరణ ఆనం తరం మంత్రి తుమ్మల జిల్లా సమాగ్రాభివృద్ధిని ప్రజలకు వివరించనున్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రద ర్శించనున్నారు. అమరవీరుల స్థూపం వద్ద మంత్రి తుమ్మలతో పాటు కలెక్టర్ జితేష్ విపాటిల్, ఎస్పీ రోహి త్‌రాజ్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు అమ రులకు నివాళులు అర్పించనున్నారు. సాంస్కృతిక కార్యక్ర మాల ఆనంతరం ప్రతిభవంతులైన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించనున్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సింగరేణి సీఏండీ బలరాం రానున్న నేప థ్యంలో కొత్తగూడెంలోని ప్రగతిమైదానాన్ని స్వరాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సింగరేణి సంస్థకు సంబందించిన వివిధ విభాగాలకు చెందిన స్టాల్స్ ఏర్పా ట్లను విభాగాధిపతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సింగరేణి ప్రగతిని సీఏండీ వివ రించనున్నారు.

భద్రాద్రిలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

- నేడు పవిత్రాధివాసం
- నిత్యకల్యాణాల నిలిపివేత

భద్రాచలం, ఆగస్టు 14: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలకు సంప్రదాయబద్ధంగా అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం గోదావరి నుం తీర్థ బిందెను తీసుకొచ్చి పవి త్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సమయంలో ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు, వేద పారాయణదారులకు దేవస్థానం అధికారుల ద్వారా దీక్షా వస్త్రాలను అందజే శారు. గురువారం ఆష్టోత్తర శతకలశావాహన, అగ్ని ప్రతి ష్ఠాపన, సాయంకాలం పవిత్రాదివాసం నిర్వహించను న్నారు.

అలాగే శుక్రవారం నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతా రామచంద్రస్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటకు పవిత్రారో పణ చేస్తారు. 17, 18 తేదీల్లో నిత్య హోమాలు, వేద పారా యణం నిర్వహించనున్నారు.

19న పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహాకుంభ ప్రోక్షణ నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా పవితోత్సవాలను పురస్కరించుకొని నేటి నుంచి 19 వరకు ఆలయంలో నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది మురళీకృష్ణమాచా ర్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్, పొడిచేటి రామభద్రాచార్యులు, ఎస్.భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమం

- సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాం
- ఇల్లెందు ఏరియాలో ఆకస్మిక తనిఖీలు

ఇల్లెందు ఆగస్టు 14: సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అధికారులను ఆదేశించారు. సింగరేణి కాలరీస్ డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యానారాయణతో కలిసి బుధవారం ఇల్లెందు ఏరియాను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత సింగరేణి ఏరియా వైద్యశాలను పరిశీలించిన బలరాం ఆసుపత్రిలో అన్ని విభాగాలను స్వయంగా పరిశీలించారు. వైద్యశాలలో అదనంగా వైద్యులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో రోగనిర్ధారణ పరీక్షలు ఎక్స్‌రే ప్లాంట్, మందుల ప్రమాణాలను, స్టోర్‌ను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది నిర్దేశిత సమయాల్లో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపటాలని, ఇందుకోసం బయోమెట్రిక్ కట్టుదిట్టంగా అమలుచేయాలని సూచించారు. అనంతరం జేకే ఓసీని, డంపింగ్ యార్డులను పరిశీలించారు. జేకే ఓసీలో పంప్డ్ స్టోరేజీ పవర్ జనరేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట సింగరేణి ఉన్నతాధికారులు, జనరల్ మేనేజర్ (కో-ఆర్డినేషన్) సుభాని, సౌర్యవిద్యుత్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ జానకిరాం, ఇల్లెందు ఏరియా జీఎం ఆనంద్, ఎస్‌టూ జి.ఎం బొల్లెం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్)జీవీ మోహన్‌రావు, చీఫ్ మేడికల్ ఆఫీసర్ సుజాత, ఎస్‌వోటు డైరెక్టర్ కేవీ.రావు ఉన్నారు.



జేకే కాలనీలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలను సందర్శించిన సీఎండీ

సింగరేణి అధికారులకు త్వరలో పీఆర్‌పీ చెల్లింపులు

ఇల్లెందు ఏరియాలో పర్యటించిన సీఎండీ బలరామ్, డైరెక్టర్ సత్యనారాయణలను కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధి కారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా అధికారుల సంఘం నాయకులు శివప్రసాద్, కె.శ్రీనివాస్, ఎస్.నాగేశ్వర్‌రావు, నర్సింహరాజు తదితరులు అధికారుల సమస్యలపై వినతిపత్రం అందచేశారు. కోల్‌ఇండియాలో 2023-24ఆర్థిక సంవత్సరంలో అధికారులు సెప్షల్ ఇన్సెంటివ్ ప్రతిభ ఆధారిత చెల్లింపులు పీఆర్‌పీ అధికారులకు చేశారని, సింగరేణి అధికారులు సైతం చెల్లించాలని అధికారుల సంఘం కోరింది.

సింగరేణి పాఠశాలలో పాఠాలు..

ఇల్లెందు ఏరియాలో పర్యటించిన సింగరేణి సీఎండీ బలరాం ఉపాధ్యాయుడిగా మారి కొద్దిసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. జేకే కాలనీలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన తరగతి గదులను పరిశీలించి విద్యాప్రమాణాలను పరీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి విద్యాసంస్థల్లో ఉన్నత విద్యాప్రమాణాలు నెలకొల్పాలని ఉపాధ్యాయులను కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సెలబస్ భోధన జరుగుతుందని ప్రకటించారు. పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు.

ఖమ్మం సీపీ సునీల్‌దత్‌కు శౌర్య పతకం



ఖమ్మం క్రైం, ఆగస్టు 14: ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు కేంద్ర ప్రభుత్వం శౌర్య పతకాన్ని ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం బుధవారం జాబితా విడుదల చేసింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా పలు విభాగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం పలు అవార్డులను ప్రకటించింది. పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ సర్వీసుల్లో విధులు నిర్వహించే 1,037 మంది అధికారులకు అవార్డు లను అందించనున్నారు. అందులో పోలీస్‌శాఖ విభాగం లో రాష్ట్రవ్యాప్తంగా 21మందికి పలు అవార్డులు ప్రకటిం చగా ఏడుగురికి శౌర్య పతకం లభించింది. వీరిలో సీపీ సునీల్‌దత్ కూడా ఉన్నారు. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్‌దత్ గతంలో భద్రాచలం ఏఎస్పీగా, జగి త్యాల ఎస్పీగా, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా, హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీగా విధులు నిర్వహించి ప్రస్తుతం ఖమ్మం సీపీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఏఎస్పీగా, ఎస్పీగా విధులు నిర్వహించి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ పతకం లభించింది.

మరణంలోనూ వీడని బంధం

- పొలం వద్ద గుండెపోటుతో భర్త మృతి
- రోధిస్తూ మృతదేహం వద్ద భార్య మృతి
- మణుగూరులోని బాలాజీనర్‌లో విషాదం



కొమ్ము సోమయ్య, శంకరమ్మ (ఫైల్)

మణుగూరు, ఆగస్టు 14: మరణంలోనూ వారిది వీడని బంధం.. సుదర్ఘ దాంపత్య జీవితంలో ఆఖరి మజిలీలోనూ వారిద్దరూ కలిసే వెళ్లారు. గుండెపోటుతో మృతి చెందిన భర్త మరణాన్ని జీర్ణించుకోలేక గంట వ్యవధిలోనే అతడి భార్య కూడా అనంతలోకాలకు చేరుకున్న ఘటన బుధ వారం భద్రాద్రి జిల్లా మణుగూరు మునిసిపాలిటీ పరిధి లోని బాలాజీనగర్‌లో జరిగింది. బాలాజీనగర్‌లో నివాస ముండే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కొమ్ము సోమయ్య (70) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య శంకరమ్మ(65), ముగ్గురు కుమారులు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అవ్వడంతో జీవనోపాధి కోసం పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. బాలాజీ నగర్‌లోని సొంతఇంట్లోనే ఇద్దరు వృద్ధ దంపతులు నివాసముంటున్నారు. కాగా తన కున్న ఐదు ఎకరాల భూమిలో వరి సాగును చేస్తున్న సోమయ్య ఎప్పటిలాగే బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో పొలంలోనే కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు గమనించి దగ్గరకు వెళ్లి పరీక్షించగా సోమయ్య అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని ఇంటికి తరలిం చగా భర్త కోసం ఎదురు చూస్తున్న శంకరమ్మ భర్త మృత దేహాన్ని చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. మృత దేహం పైపడి రోధించింది. ఈ క్రమంలో ఆమె కూడా గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచింది. సోమయ్య కుమారులకు తండ్రి మరణించాడనే వార్తను తెలిపేలోపే తల్లి కూడా మృతి చెందడం స్థానికులను విస్మయానికి గురి చేసింది. ఈ ఘటనలో బాలాజీనగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రాబోయే తరాలకు కోయభాష ప్రాముఖ్యత తెలియజేయాలి

» ఐటీడీఏ పీవోకు కోయభాషలో ఆహ్వానపత్రిక అందజేత



ఆహ్వానపత్రికను పీవోకు అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 14: రాబోయే తరాలకు కోయభాష ప్రాముఖ్యతను తెలియజేయడానికి నేటితరం గిరిజన యువత కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం కోయభాషా ప్రణాళిక కార్యాచరణ శిక్షణ కార్యక్రమంకు రావాలని ఆహ్వానిస్తూ ఈఎస్ఈడీ ఆర్గనైజర్ కమిటీ సభ్యులు రాజేంద్రకుమార్ ఆహ్వానపత్రికను అందజేశారు. బుధవారం ఐటీడీఏ ఆవరణలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేటితరంకు, రాబోయేతరంకు గిరిజన యువతి యువకులకు, పిల్లలకు సాంస్కృతిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కోయభాష ప్రాముఖ్యతను గురించి 18న బూర్గంపాడు మండలం కోయగూడెం గ్రామంలో జరిగే శిక్షణ కార్యక్రమంకు పీవోను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు తిరుపతమ్మ, రమాదేవి, కుమారి, భారతి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు

» వారంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ » కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 14: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఎటువంటి అక్రమ కట్టడాలు, నిబంధనలకు అతిక్రమించి చేపట్టినా కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పష్టంచేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'బైపాస్ కబ్జా' కథనంపై కమిషనర్ స్పందించారు. ఖమ్మం నగరంలోని ప్రధాన సమస్యలపై మాట్లాడారు. సెట్‌బ్యాక్‌లు లేకుం డా రహదారులకు అడ్డుగా నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. తాను మేడ్చల్‌లో అక్రమ కట్టడాలపై తీసుకున్న చర్యలతో మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఖమ్మంలోను ఆదే విధంగా వ్యవహరిస్తామన్నారు. పారిశుధ్య కార్మికుల కోసం బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. డంపింగ్‌యార్డు రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు జరిగాయన్నారు. బయో మైనింగ్ ఇప్పటికే 40శాతం పూర్తి జరిగిందన్నారు. పారిశుధ్య వాహనాలకు జీయో ట్యాగింగ్ ఏర్పాటు చేసి ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ఇందుకోసం వారం రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్ ఇతరశాఖలతో కలిపి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 14: ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని ఆరు నెలలుగా వేడుకుంటున్నా ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించక పోవడంతో బుధవారం ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్‌కు సమ్మె పోటీసుఇచ్చారు. ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ పి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ 14 రోజులు లోపు సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మె సమ్మె తప్పదని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీకి హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఆయుష్మాన్ భారత్ హెల్త్ పథకంలో ప్రభుత్వ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్నారని అన్నారు. ఆరోగ్య మిత్రల జీతభత్యాలు చాలా తక్కువగా ఉన్నాయని.ఆరోపించారు.. గతంలో ట్రస్ట్ యాజమాన్యం ఇచ్చిన హామీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జీతాలు పెంచాలని కోరుతూ 2023 డిసెంబర్ ప్రభుత్వానికి, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ సమస్యలను వివరించినట్లు తెలిపారు. జూన్ 14న వైద్యారోగ్య శాఖామంత్రిని కలికి సమస్యలను వివరించినా అన్యాయం జరిగిందని ఆరోపించారు. దీంతో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈసమ్మె నోటీసు అందించిన వారిలో జిల్లాల ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు

» అభివృద్ధి ముసుగులో అవినీతికి పాల్పడ్డారు
» బీఆర్ఎస్ నాయకులపై సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఫైర్

సత్తుపల్లి, ఆగస్టు 14: ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన, చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై చేసిన ఆరోపణలపై ఆమె బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను జలగం వెంగళరావు తరువాత తుమ్మల నాగేశ్వరరావు గణనీయంగా అభివృద్ధి చేశారని అన్నారు. ఖమ్మం జిల్లాలో తీవ్ర కరువు మండలాలైన తిరుమలాయపాలెం, వేంసూరు మండలాలకు సాగు నీరు అందించిన ఘనత తుమ్మలదేనని చెప్పారు. దశాబ్దాల క్రితమే తుమ్మల గోదావరి జలాలు జిల్లాలో సాగు భూములకు మళ్లించేందుకు తుమ్మల ప్రతిపాదనలు చేశారని గుర్తు చేశారు. జిల్లాలో ఒక్క మీటరు జాతీయ రహదారి లేని స్థితి నుంచి ఉమ్మడి జిల్లాలో నలువైపులా జాతీయ రహదారులు, మండల కేంద్రాలకు డబుల్ రోడ్లు నిర్మించిన ఘనత ఆయనదన్నారు. 2016లో తుమ్మల సూచన మేరకు సీతారామా ఎత్తిపోతల పథకానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసారని, 2018 వరకూ పనులు జరిగినా 2018లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత పనులు నిలిచిపోయాయని అన్నారు. జిల్లాలో అప్పట్లో ఉన్న మంత్రులు కాని, ఎమ్మెల్యేలు కాని సీతారామా ప్రాజెక్టు పనులు సమీక్ష చేసిన సంఘటన లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి తుమ్మల సీతారామా పనులు వేగం పెంచి తక్షణమే గోదావరి జలాలు ఇచ్చేందుకు వీలుగా 9కిలో మీటర్లు కాలువ తవ్వి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే ప్రారంభింప జేస్తున్నారని అన్నారు. కేవలం కమీషన్ల కోసం మోటార్లు కొనుగోలు చేసి ప్రాజెక్టు మొత్తం తామే పూర్తి చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రకటించుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. మీ హయాంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ఇతర పథకాల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

ముసుగులో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో తుమ్మలను బీఆర్ఎస్ ప్రభుత్వం వేధించి అవమానించిందని, చివరకు సీతారామాపై సూచనలు కూడా పట్టించుకోలేదని అన్నారు. మంత్రి తుమ్మల చొరవతో గోదావరి జలాలు విడుదల అవుతుంటే బీఆర్ఎస్ నాయకుడు జీర్ణించుకోలేక తుమ్మలపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి అంటూ ప్రజలకు మభ్య పెట్టిన కారణంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని అన్నారు. ఇక ముందు అయినా జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు అడ్డుపడకుండా ఉంటే మంచిదని అన్నారు. ఇదే రకంగా జిల్లాకు చెందిన మంత్రులపై విమర్శలకు దిగితే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

బీఆర్ఎస్ పాలనలో ముందుకు సాగని సీతారామ

కల్లూరు: గత బీఆర్ఎస్ పాలనలో సీతారామ ప్రాజెక్టు ఏమాత్రం ముందుకు సాగటమే కాకుండ ఒక్క ఎకరాకి సాగునీరు అందించ లేదని కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, ఏనుగు సత్యంబాబు, భూక్యా శివకుమార్‌నాయక్ లక్కినేని రమేష్, పెద్దబోయన శ్రీనులు మాట్లాడారు.

దేవాదాయ శాఖ ఏసీగా వీరస్వామి బాధ్యతల స్వీకరణ



ఏసీని అభినందిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 14: ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా బుధవారం వీరస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వీరస్వామి ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. సాధారణ బదిలీల్లో బాగంగా గత నెల 31న వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తు ఖమ్మం సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు. 1998 నుంచి 2003 వరకు ఖమ్మం ఏసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా, 2010 నుంచి 2013 వరకు సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోఅన్యాక్రాంత మైన దేవాలయ భూములను సర్వే నిర్వహించి ఆలయా లకు చెందేవిదంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వీరస్వామిని పలువురు ఉద్యోగ, అర్చక సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలోని పవనసుత జలాంజనేయ స్వామి ఆలయంలో బదిలీ ఐన దేవాదాయ శాఖ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించి సన్మానించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ రైతు మృతి

కామేపల్లి, ఆగస్ట్ 14: ప్రమాదవశాత్తు ఓ మహిళ రైతు కాలు జారి వ్యవసాయ భూమిలో పడి మృతి చెందిన సంఘటన కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పండితాపురానికి చెందిన దర్మసోత్ కిషన్ నాగమణి(45) దంపతులు తమకున్న వ్యవసాయ భూమిలో పనుల నిమిత్తం వెళ్లారు. నాగమణి మంచినీళ్లు తాగుదామని వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లింది. తాగే క్రమంలో కాలు జారి బావిలో పడిపోయింది. ఇది గమనించిన భర్త కిషన్ కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే ఆమె నీటిలో మునిగి మృతి చెందింది. తండ్రి తేజావత్ లాల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

తల్లిపాల బ్యాంకు నిర్వహణ భేష్: శిక్షణ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 14: ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రంలో తల్లిపాల బ్యాంకు నిర్వహణను శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మంగళవారం సందర్శించారు. తల్లి పాలను సేకరించడం దాన్ని భద్రపరిచే విధానంతో పాటు వాటిని తల్లిపాలు అందని పిల్లలకు ఇచ్చే విధానంపై ఆయన ఆసక్తిగా తిలకించారు. దీని నిర్వహణకు వైద్యులు , సిబ్బంది చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. అనంతరం పిల్లల వార్డును, ఎస్ఎన్‌సీయూని కూడా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వైద్యులు డాక్టర్ బాబూ రత్నాకర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి ఆచూకీ లభ్యం

» హైదరాబాద్‌లో కనుగొన్న పోలీసులు » ఖమ్మం బాలల సదనంలో చిన్నారికి ఆశ్రయం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 14: చిన్నారి ఆచుకి కోసం 45 రోజులుగా ఎదురుచూస్తున్న తల్లికి ఎట్టకేలకు ఆ చిన్నారి ఆచూకి లభ్యమైంది. బాధితులు తెలిపిన వివరాలు.. ఖమ్మం నిజాంపేటకు చెందిన ఓ యువతికి చెందిన 3 సంవత్సరాలు చిన్నారి ఆమె అత్త వద్ద నుంచి అదృశ్యం కావటంతో చిన్నారి తల్లి అనుమానం వచ్చి ఖమ్మం సీసీఎస్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు సీడబ్ల్యూసీ అధికారులు చిన్నారి ఆచూకిని కనుగొన్నారు. 45 రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి ఐదు నుంచి ఆరుగురి చేతులు మారి చివరికి హైదరాబాద్‌లో ఉన్నట్లు కనుగొని మంగళవారం రాత్రి ఖమ్మం తీసుకొచ్చి సీడబ్ల్యూసీ అధికారుల సమక్షంలో ఉంచారు. ఖమ్మం నిజాంపేటకు చెందిన సదరు యువతి రఘునాథపాలేనికి చెంది న ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి 2022 లో బాబు జన్మించాడు. బాబు జన్మించిన నెల రోజులకే తండ్రి ఓ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాబు తల్లి వద్ద ఉంటున్నాడు. చిన్నారి నాయనమ్మ బాబుని నేను పెంచుకుంటాను నీవు మళ్లీ పెళ్లి చేసుకో అంటూ బాబును దత్తతకు తీసుకుంటున్నట్లు దత్తపత్రం రాయించుకుంది. కొన్ని రోజుల అనంతరం బాబును చూడాలని చిన్నారి తల్లి అత్తకు ఫోన్ చేయగా ఆమె సంబంధంలేని మాటలు చెప్పటంతో అనుమానం వచ్చి బాబు అత్త వద్ద లేడని తెలుసుకోని పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసుల విచారణలో బాబు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం సీడబ్ల్యూసీ అధికారుల సమక్షంలో ఆ చిన్నారిని నగరంలోని బాలల సదనానికి తరలించారు. పోలీసుల విచారణ అనంతరం చిన్నారిని తల్లికి ఇవ్వటమా, లేక ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దత్తతకు ప్రకటించటమా తెలియాల్సి ఉంది. చిన్నారి అదృశ్యం వెనుక ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. వీరి అనుమతితోనే చిన్నారిని విక్రయించి డబ్బుల పంపకంలో తేడాలు రావటంతోనే విషయం బైటపడిందనే విమర్శలు వినపడుతున్నాయి. కాగా తల్లి నా చిన్నారి నాకు కావాలని అధికారులను వేడుకుంటుం ది. పోలీసులు చిన్నారి అదృశ్యం వెనుక ఉన్న వారిని కనుగొనేందుకు చర్యలు చేపట్టారు. అసలు విక్రయించిన వారు ఎవ్వరో తెలిసేంత వరకు చిన్నారిని బాల సదనంలోనే ఆశ్రయం కల్పించను న్నారు. పోలీసుల విచారణ అనంతరమే చిన్నారిని తల్లికి అప్పగించనున్నట్లు తెలిసింది. చిన్నారిని నాయనమ్మే విక్ర యించిందా ఆమె ఎవరి సహకారంతో శిశువును విక్రయిం చింది అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నా చిరకాల కోరిక నెరవేరుతోంది

అశ్వారావుపేట/ములకలపల్లి/కొత్తగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు పూసుగూడెం పంపు హౌస్ నుంచి వెలుపలకి వచ్చిన గోదావరి నీటిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తడిచి ముద్దయి పులకించి పోయారు. తన రాజకీయ చిరకాలిక కోరిక నెరవేరుతుందంటూ భావోద్వేగంతో మురిసిపోయారు. బుధవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నీటి పారుదలశాఖ అధికారులతో కలిసి భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం పంపు హౌస్‌లను పరిశీలించారు. పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయడంతో గోదావరి నీరు పరవళ్లు తొక్కుతూ వస్తున్న దృశ్యాలను కొద్దిసేపు చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు అక్కడున్నవారంతా గోదావరి నీటిలో తడుస్తూ పులకించి పోయారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరామ చంద్రుడు నడయాడిన, సీతమ్మవారు వనవాసం చేసిన పర్ణశాల సమీపంలోని దుమ్ముగూడెం వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టును గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదగా ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు గోదావరి నీటిని తీసుకెళ్లి అక్కడి భూములకు సాగునీరందించేందకు చేపట్టిన సీతారామ ప్రాజెక్టు తమ చేతులమీదుగా ప్రజలకు అందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పంట కాలువలు, భూసేకరణ, అటవీ అనుమతులు వంటి సమస్యలను పూర్తి చేసుకొని వచ్చే సీజన్‌కల్లా పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాలకు నీరందించనున్నట్టు



పూసుగూడెం వద్ద సీతారామ పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న తుమ్మల, తదితరులు

ఆయన తెలిపారు. యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి సత్తుపల్లి ట్రంకు ద్వారా రెండు లక్షల ఎకరాలకు, జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తీసుకెళతామన్నారు. ఇప్పటి వరకు 30-35 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే అటవీ, ఇతర అనుమతులు, భూ సేకరణ పనులు పూర్తి చేసి గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం పూర్తి చేయనున్నామన్నారు. నదుల అనుసంధానం మహా ఘట్టమన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పూసుగూడెం, కమలాపురం పంపు హౌస్‌లను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు.

అనంతరం వైరాలో జరిగే బహిరంగ సభలో నదుల అనుసంధానం, రూ.రెండు లక్షల రైతురుణమాఫీని ప్రకటిస్తారన్నారు. రైతులకు ఉపయోగపడే ఈ రెండు కార్యక్రమాలకు ఖమ్మం వేదిక కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులకు మేలుచేసే రుణమాఫీ, గోదావరి జల్లాలను అందించడం తన హయాంలో పూర్తి చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయడం సాహసోపేత నిర్ణయమన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్న పైలాన్‌ను మంత్రి తుమ్మల పరిశీలించారు. సీఎం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎస్సీ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్, తదితదిరులు పాల్గొన్నారు.

వైరా సీఎం సభకు సర్వం సిద్ధం

● వరుణుడిపైనే భారం

వైరా, ఆగస్టు 14: వైరాలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ రైతు సభ కోసం సర్వం సిద్ధమైంది. సుమారు లక్షమంది రైతుల సమీకరణ లక్ష్యంగా సీఎం సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారి పక్కన వైరా శాంతినగర్ వద్దనున్న న్యూలిటిల్‌ఫ్లవర్ సమీపంలోని వెంచర్ల స్థలంలో సీఎం సభను ఏర్పాటు చేశారు. గత వారంరోజుల నుంచి రాత్రింబవళ్లు వందలాదిమంది ఏర్పాట్లు చేశారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ నేతృత్వంలో సభా ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రతిరోజూ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభ ఏర్పాట్లను సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు. ఈ సభా వేదికపైనుంచే రూ.రెండు లక్షల రుణమాఫీ చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు అందజేస్తారు. సీతారామ ప్రాజెక్టు మూడు పంపుహౌజ్‌లను ప్రారంభించిన తర్వాత మధ్యాహ్నం 2.45గంటలకు రేవంత్‌రెడ్డి వైరా చేరుకొని రుణమాఫీ చెక్కులు పంపిణీ చేసి రైతులనుద్దేశించి ప్రసంగిస్తారు. వేదిక సమీపంలోనే సీఎం కోసం ఒక హెలీప్యాడ్‌ను, సీఎస్ఐ చర్చి సమీపంలో మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల కోసం మరో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. రైతులు తరలివచ్చే వాహనాలను ఆరు ప్రాంతాల్లో నిలిపేందుకు ఆరుచోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వైరాలోని డివైడర్లకు రంగులు వేశారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కొన్నిచోట్ల డివైడర్ల మధ్యలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తోరణాలు, ఫ్లెక్సీలతో వైరాలోని రహదారులను ముస్తాబు చేశారు. వ్యవసాయశాఖ సహా పలు ప్రభుత్వశాఖలకు చెందిన 30స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు.

1,150మందితో భారీ పోలీసు బందోబస్తు

వైరాలో 1,150మంది పోలీసులతో ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరుగురు అదనపు డీసీపీ, ఏఎస్పీలు, 13మంది డీఎస్పీలు, 35మంది సీఐలు, 84మంది ఎస్ఐలు, 50మంది ఏఎస్ఐలు, 143మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 420మంది పోలీసు కానిస్టేబుళ్లు, 320మంది హోంగార్డులు, ఐదు స్పెషల్ పార్టీలకు చెందిన సుమారు 75మంది సహా మొత్తం 1,150మందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

సీఎం భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

వైరా, ఆగస్టు 14: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వైరాలో బుధవారం భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. రుణమాఫీ రైతు సదస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వైరాలో రైతు బహిరంగ సభలో పాల్గొంటున్నారు. సీఎం పాల్గొనే సభకు సంబంధించిన భద్రత, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ గ్రౌండ్, సభావేదికను సందర్శించి భద్రతాపరమైన ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నిఘా, పటిష్ఠమైన బందోబస్తుకు అవసరమైన ఏర్పాట్లపై పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వచ్చే వాహనాలు, ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై సమీక్షించారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

గలగలా గోదారి తరలివచ్చే వేళ..

(5వ పేజీ తరువాయి)

వినియోగంలోకి తీసుకొచ్చేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఏన్కూరు లింక్‌కెనాల్‌కు నిధులు మంజూరు చేశారు. సీఎం అయిన తర్వాత భద్రాచలం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు చొరవతో జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించి నిధులు మంజూరు చేశారు. దీంతో ఏన్కూర్ లింక్‌కెనాల్ పనులు చకచకా పూర్తి చేశారు. మోటార్ల ట్రయల్ రన్ చేయడంతో గోదావరి నీటి విడుదలకు ముహూర్తం కుదిరింది. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాదు నుంచి గురువారం ఉదయం 12-50గంటలకు భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడేనికి చేరుకుని మధ్యాహ్నం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు పంపుహౌజ్-2ను ప్రారంభిస్తారు. అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడతారు. అనంతరం 2-45గంటలకు వైరా బయలుదేరతారు. వైరాలో 3నుంచి 4-30గంటల వరకు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ఇదే వేదిక పైనుంచి చివరి విడతగా రూ.2లక్షల రైతురుణమాఫీ చేయనున్నారు. వైరాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి రైతులు, మహిళలను భారీగా సమీకరించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తిస్థాయి నిర్మాణానికి నిధులతో పాటు సీతమ్మసాగర్ బ్యారేజీ హైడల్ ప్రాజెక్టు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తారని, జిల్లాకు కొత్త వరాలు ప్రకటిస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు, పర్యాటక అభివృద్ధి, సాగునీటి కోసం కొత్తగా ఎత్తిపోతల పథకాలకు ముఖ్యమంత్రి ప్రకటనపైనే నిధులు కేటాయింపు ఆధారపడి ఉంది. ఏపీకి సరిహద్దున ఉన్న ఉమ్మడి ఖమ్మంజిల్లా మరింతగా అభివృద్ధి చేయాలంటే నిధులు కేటాయిస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల

ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములను గోదావరి జలాలతో తడపడమే తన జీవితాశయం అని ప్రకటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టుబట్టి సీతారామ ప్రాజెక్టు తొలిదశను పూర్తి చేయించారు. ఆగస్టు 15 గోదావరి జలాలను విడుదల చేయిస్తానని పదేపదే చెప్పిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పినట్లుగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ద్వారా నీటి విడుదల చేయించబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా పడి ఉన్న సీతారామ ప్రాజెక్టును గాడిలో పెట్టేందుకు వ్యవసాయశాఖ మంత్రిగా బాధతలు చేపట్టిన వెంటనే మంత్రి తుమ్మల చొరవ తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి సీతారామ కోసం నిధులు మంజూరు చేయించారు. జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించి లింక్‌కెనాల్ ద్వారా ఈ సీజన్‌లో నీరు ఇవ్వొచ్చని చూపించి పరిపాలన మంజూరుకు కృషిచేశారు. దీంతో వెంటనే మంత్రులు పనులకు శంకుస్థాపన చేసి రాజీవ్‌కెనాల్‌గా నామకరణం చేశారు. రెండున్నర నెలల్లోనే పనులు పూర్తిచేశారు. ఆగస్టు 15కి సీఎం చేతుల మీదుగానే గోదావరి నీళ్లు వదిలించి సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని శంకుస్థాపన రోజు చెప్పినట్టుగానే గురువారం నీటి విడుదల చేయిస్తున్నారు.

సీఐల బదిలీ

ఖమ్మంక్రైం, ఆగస్టు 14: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఖమ్మంరూరల్ సీఐ రాజిరెడ్డి, ఓ.మురళి, అంజలిసీ బదిలీ చేశారు.

సీతారామ ప్రాజెక్టు క్రెడిట్ కేసీఆర్‌దే

● ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు14: సీతారామ ప్రాజెక్టు క్రెడిట్ ముమ్మాటికి కేసీఆర్‌దేనని, ఈప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు పూర్తవుతున్నా చేసింది ఏమీ లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన సీతారామను, కాంగ్రెస్ పూర్తి చేసినట్టుగా చెప్పుకుంటూ బీఆర్ఎస్‌పై తప్పుడు పద్ధతుల్లో గోబెల్స్ ప్రచారం చేస్తూ వారి తప్పును కప్పిపుచ్చుకుంటున్నారని విమర్శించారు. నేడు వైరాలో జరిగే సభలో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటుగా చుట్టుపక్కల జిల్లాలకు సాగునీరందించేందుకు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ అని, ఆప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్నీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్నీ అని సీఎం వివరించాలన్నారు. పక్కరాష్ట్రంలో పెంచిన రూ.4వేల పింఛన్‌ను పాత బకాయిలతో కలిపి ఒకేసారి రూ.7వేలు అందిస్తే, తెలంగాణలో మాత్రం రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పింఛన్లు అందించేందకు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకే విడతలో రెండులక్షల రుణమాఫీ అంటూ మాయమాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పాలేరులోని వివిధ మండలాల్లో పడావుపడిన బీడు భూములు సాగులోకి తెచ్చేందుకు 9నెలల్లో ప్రతిష్టాత్మకంగా భక్త రామదాసు పూర్తిచేసి 70వేల ఎకరాల పైగా ఆయకట్టును స్థిరీకరించిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌దన్నారు. అనంతరం మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తయిందన్నారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ నాయుకలు గుండాల కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఉప్పల వెంకటరమణ, బె ల్లం వేణు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నరేంద్ర పాల్గొన్నారు.

దేవస్థానంలో టెండర్ల నిర్వహణ


టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 14: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం ఏడు అంశాలకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. ఇందులో ఫొటో లైసెన్స్ హక్కు, టెండర్‌ను నిర్వహించారు. అలాగే మొబైల్స్ భద్రపర్చే లైసెన్స్ హక్కు సైతం టెండర్లను నిర్వహించారు. అయితే వీటికి అధికారికంగా టెండర్లను ఖరారు చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన నాలుగు అంశాలకు సంబంధించి టెండర్లను వాయిదా వేసినట్లు సమాచారం. ఈ టెండర్ల ప్రక్రియను భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

పినపాకలో ఇంటర్ విద్యార్థుల మధ్య ఘర్షణ

పినపాక, ఆగస్టు14: పినపాక జూనియర్ కళాశాలకు చెందిన ఓ నలుగురు విద్యార్థుల మధ్య బుధవారం ఉదయం ఘర్షణ జరిగింది. పినపాక మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఓ దుకాణం వద్ద నడిరోడ్డుపై ఘర్షణ పడుతున్న సమాచారం అందుకున్న ఏడూళ్లబయ్యారం పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకుని, విచారించారు. ఘర్షణకు గల కారణాలు తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులను పిలిపించి, వారి సమక్షంలో మందలించి పంపినట్లు తెలుస్తోంది. అయితే గొడవకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కాగా మండల కేంద్రంలో ఉన్న హాస్టల్ పలువురు ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉంటున్నారు. ఈ వసతి గృహంలో పర్యవేక్షణా లోపంతోనే విద్యార్థులు ఇలా ఘర్షణకు దిగుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇలా విద్యార్థులు రోడెక్కి బహిరంగంగా ఘర్షణ పడుతుంటే, వార్డెన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండ చూడాలని కోరుతున్నారు.

భద్రాద్రి జిల్లా నీటి వాటాపై హామీ ఇవ్వాలి

● సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

కొత్తగూడెం, ఆగస్టు 14: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ జిల్లాకు రావల్సిన నీటి వాటాను నేడు ముఖ్యమంత్రి స్పష్టమైన హామీతో ప్రకటించాలని, ఎప్పటి వరకు నీటిని అందించేదీ తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కాసాని ఐలయ్య, ముత్యాల విశ్వనాథం, జాటోత్ కృష్ణ, నాగేశ్వరరావు, ఉక్లా నాయక్‌లు ప్రభుత్వం ముందు పలు డిమాండ్‌లను ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18,600 కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం 8,600 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు ఖర్చు అయ్యాయని, ఇంకా రూ.10 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి దశలో హడావుడిగా ప్రాజెక్టును నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నేడు భద్రాద్రి జిల్లాకు రావలసిన నీటి వాటాలను పక్కన పెట్టి గోదావరి వరదలతో వచ్చిన నీటిని సాగర్‌కి లింక్ చేసి తరలించడం ఈ జిల్లాను అన్యాయం చేయడం కాదా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాలంటే సీతమ్మసాగర్ సాగర్ పూర్తి కాకుండా ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. సీతమ్మసాగర్ నిర్మాణం కూడా మధ్యలోనే ఉందని, అది పూర్తి కావడానికి కనీసం రెండు సంవత్సరాలు పడుతుందని అన్నారు. దీంతో పాటు 280 మెగావాట్ల విద్యుత్ తయారీ కూడా జరగాల్సి ఉందని, కరెంటు తయారీ కాకుండా , సీతమ్మసాగర్ సిద్ధం కాకుండా సీతారామ ప్రాజెక్టును నేడు ప్రారంభించాల్సిన అవసం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ జిల్లా అభివృద్ధికి పాత డిజైన్‌ను అమలు చేసి 20 మండలాలకు సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను అనుసంధానం చేసి నీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై నేడు ముఖ్యమంత్రి రైతు సంఘాల నాయకులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అలా జరగని పక్షంలో మేమే ప్రారంభోత్సవం దగ్గరకు వచ్చి మాట్లాడతామని స్పష్టం చేశారు. ఆ సందర్భంలో ఎటువంటి ఘటనలు జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ, చంద్రా నరేంద్రకుమార్, చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, సతీష్, రాంచందర్, చంద్రశేఖర్, మల్లికార్జునరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రైతుసంఘం నాయకులు

రైతులకు సాగునీరందివ్వాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా



సమావేశంలో మాట్లాడుతున్న షాబీర్ పాషా

మణుగూరు, ఆగస్టు 14 : గోదావరి జలాలతోనే తెలంగాణ జిల్లాలు అభివృద్ధి చెందుతాయని ప్రప్రథమంగా చెప్పింది సీపీఐ పార్టీ అని, పార్టీ నాయకులు ఎంతో మంది సినియర్లు ఎన్నో ఆందోళనలు పోరాటాలు సాగించడం వల్ల జిల్లాలోని సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాష తెలిపారు. బుధవారం మణుగూరు సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టును ప్రారంభించి రైతాంగానికి సాగు నీరు అందించడాన్ని సీపీఐ పార్టీ స్వాగతిస్తోందన్నారు. దీనికి తామేమి వ్యతిరేకం కాదన్నారు. అయితే పినపాక నియోజకవర్గం నుంచి సాగు నీరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని మండలాలకు సాగు నీటి వసతిని ఈ ప్రాజెక్టు ద్వారా అందివ్వాలని కోరారు. దుమ్ముగూడెంలో బిండెడు నీటితో 46 మండలాలను పాదయాత్ర చేసి ఖమ్మం పాలేరు వరకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. 2004 జలయగ్నం పేరిట ప్రకటించిన ప్రాజెక్టులో రాకపోయే సరికి అప్పటి నాయకులు చౌదరి, నాటి ఎమ్మెల్యే పాయం, రాష్ట్ర నేత బి అయో ధ్య, రామకృష్ణ ప్రతినిధి బృందంగా నాటి సీఎంకు రాజశేఖర్‌రెడ్డిని స్వయంగా కలుసుకుని ప్రాజెకు ఏర్పాటు చేసి జిల్లా వాసులకు న్యాయం చేయాలని కోరామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోయే సరికి సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తామని సీపీఐ రాష్ట్ర కమిటీ ప్రకటన చేసిందన్నారు. దీంతో సీఎం హైదరాబాద్‌లో ఇందిరా పార్కులో జిల్లాకు న్యాయం చేస్తామని దుమ్ముగూడెం ప్రాజెక్టును మూడు నెలల్లో ఏర్పాటు చేస్తామని వైఎస్ఆర్ హామీ ఇచ్చారన్నారు. 2005లో డిసెంబర్ నెలలో శంకుస్థాపన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ పేరుతో చేశారన్నారు. పేర్లు మారినా ఏ ప్రాజెక్టు అయినా గోదావరి జలాలను రైతాంగానికి అందించాలని సీపీఐ ఉద్యమాలు నడిపిందన్నారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన అడువులు ఇక్కడివి, నిర్వాసితులు ఇక్కడ ఉన్నారు. నీళ్ల ఇక్కడివీ, జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోంది. గత ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చేస్తామని చెప్పారు. కానీ చేయలేదు.. సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సంతోషకరమై అయినా పినపాక నియోజకవర్గలో చుక్క నీరు రావు, బూర్గంపాడు, అశ్వాపురం మణుగూరు పినపాక కరకగూడెం గుండాల ఆళ్లపల్లికి సాగు నీరందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన టేకులపల్లి, గార్ల ఇల్లెందు బయ్యారం, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం ములకలపల్లి అశ్వారావుపేట పాల్వంచ సుజాత నగర్ ఎక్కడి నీరొచ్చే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టినం.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తర్వాత సీపీఐ తరుపున కూనంనేనిసాంబశివ రావు భద్రాచలం సభలో ప్రాజెక్టుపై పలు అంశాలను ప్రస్తావించారని తెలిపారు. పూసుగూడెం రివ్యూ సమావేశంలో కూడా ఐదు మండల రైతుల పక్షాణ సాగు నీరందివ్వాలని కోరామన్నారు. అన్ని మండలాలకు సీతారామ ప్రాజెక్టు సాగు నీరందివ్వాలని కోరారు. పార్టీలకు అతీతంగా ఈ ప్రాంత రైతాంగం కొసం మాట్లాడాలని న్యాయం జరిగే విధంగా ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, మోహన్‌రావు, సుధాకర్, కుటుంబరావు, రాములు, సీతారాములు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో భద్రాద్రి నృత్య కళాకారిణి ప్రతిభ


జ్ఞాపికను అందుకుంటున్న వైష్ణవి

భద్రాచలం, ఆగస్టు 14: జాతీయస్థాయి కూచిపూడి నృత్యపోటీల్లో భద్రాద్రి కళాకారిణి వైష్ణవి ప్రతిభ చాటారు. ఇటీవల వారణాసి, అయోధ్యలో నిర్వహించిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో చిన్నారి పాల్గొంది. హైదరబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యపోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన వైష్ణవి, వాగ్దేవి వాయిద్య సంగీత నృత్యకళాక్షేత్రం ఆధ్వర్యంలో వారణాసి, అయోధ్యలో జరిగిన పోటీలో కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటడంతో వారణాసి శివగంగ, అయోధ్య బలరామ అవార్డులను గెలుచుకొంది. గతంలో సైతం ఈ బాలిక రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యపోటీల్లో అనేకమార్లు బహుమతులు గెలుచుకోవడం జరిగింది. కాగా కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటిన తమ పాఠశాల విద్యార్థిని వైష్ణవిని త్రివేణి పాఠశాల యాజమాన్యం, పలువురు అభినందించారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా చైతన్య బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న చైతన్య

భద్రాచలం, ఆగస్టు 14: వైద్యఆరోగ్యశాఖ భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌వోగా (ఎఫ్ఏసీ) డాక్టర్ ఆర్.చైతన్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ డీఎం హెచ్‌వోగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రాజ్‌కుమార్ హైదరాబాద్‌కు పారెన్ సర్వీసెస్‌లో భాగంగా వెళ్లడంతో ఆయన స్థానంలో డాక్టర్ చైతన్యను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.భాస్కర్ నియమించారు. ఈ క్రమంలో చైతన్య బాధ్యతలు చేపట్టగా, ఆయనకు వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ముత్యాలరావు, సీహెచ్‌వో కాంతమ్మ, హెచ్ఈవో గొంది వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంటు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కడసారి వీడ్కోలు కష్టాలు

● కిలోమీటరకు పైగా బురద దారిలోనే నడక

దుమ్ముగూడెం ఆగస్టు14: స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏడు ఏళ్లు గడిచినా కొన్ని ఆదివాసీ గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామపంచాయతీ నందులచెలక గ్రామ ఆదివాసీలకు ఏళ్ల తరబడి కడసారి వీడ్కోలు కష్టాలు తప్పడం లేదు. వానాకాలంలో గ్రామస్థులెవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి నానా తిప్పలు పడాల్సిన దుస్థితి అక్కడ నెలకొంది. కిలోమీటరుకు పైగా దూరంలో ఉన్న స్మశానవాటిక దారి పూర్తి బురదమయంగా మారింది. ఎత్తు పల్లాలు, ఎగుడు దిగుడులతో అడుగున్నర లోతు బురదలో మంచంపై మృతదేహాన్ని తరలించడానికి నానా యాతన పడాల్సి వస్తోంది.

కాగా గ్రామంలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన సోయం రామమ్మ (60) అనే మహిళ అంత్యక్రియల కోసం గ్రామ ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో గ్రామ ఆదివాసీలంతా కలిసి సొంతంగా డబ్బులు పోగేసుకొని ఒకటిరెండు సార్లు ఈ రోడ్డుపై గ్రావెల్ పోశారు. మృతదేహాన్ని ట్రాక్టరుపై సైతం తరలించడానికి సాధ్యపడకపోవడంతో బురదలోనే మృతదే హాన్ని తీసుకెళ్లారు. అంత్యక్రియల కోసం ఎప్పటి నుంచో ఇదే తరహా ఇబ్బందులు పడుతున్నామని, స్మశాన వాటికకు కనీసం మెటల్ రహదారినైనా ఏర్పాటు చేయాలని తాజా మాజీ ఎంపీటీసీ తిరుపతిరావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


బురదలో మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

పది గొర్రెలు చోరీ

● గుండెపుడి గ్రామంలో ఘటన

జూలూరుపాడు, ఆగస్టు 14: మండలంలోని గుండెపుడి గ్రామంలో ఓ రైతుకు చెందిన పది గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గుండెపుడి గ్రామానికి చెందిన మద్దిబోయిన పిచ్చారావు తన ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన దొడ్డిలో 100 గొర్రెలను ఉంచి ఇంట్లో నిద్రపోయాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు పది గొర్రెలను ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన గొర్రెలు రూ. 1.70వేలు ఉంటాయని రైతు తెలిపారు. చోరీ సంఘటనపై సదరు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ నిర్వహించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం, ఆగస్టు 14: ఆటో, ద్వి చక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. బట్టుపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి మధు తన కుమారుడితో ఆటోలో కరకగూడెం వైపు తన ఇంటికి వస్తుండగా, కరకగూడెం వైపు నుంచి బట్టుపల్లికి తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న షేక్ ఖదీర్ అనే వ్యక్తి అదుపు తప్పి ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఖదీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు శాంతకు సన్మానం


శాంతమ్మను సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమరయోధురాలు, మాజీ ఎమ్మెల్యే దివంగత బీమపాక భూపతిరావు సతీమణి బీమపాక శాంతను ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారి సేవల వలన మనం స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ సీఎం శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ

సత్తుపల్లి,ఆగస్టు14:కోల్‌కతాలోని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో ట్రెయినీ మహిళా డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సత్తుపల్లి డాక్టర్ అసోసియేషన్ బాధ్యుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుంచి రింగ్‌సెంటర్ వరకు కొవ్వొత్తులు వెలిగించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఘటనపై మెజిస్ట్రీ రియల్ విచారణ జరపాలని, ఆర్‌జీకార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నుంచి సీనియర్ అధికారులను తొలగించాలంటూ కోరారు. కార్యక్రమంలో వైద్యులు నల్లమల కిరణ్‌కుమార్, పి. వసుమతిదేవి, రమాకాంత్, సత్యప్రసాద్, ఇమ్మడి ప్రసాద్, రమేష్‌చంద్ర, అశోక్, రాకేష్, సురేష్ రామాల, మౌలాలీ, శివకృష్ణ, రాజేష్, రమ్య, శ్రీహరి, వెంగళరావు, హర్షిత్, సాంబశివరావు, స్నిగ్ధ, ప్రణయ్ పాల్గొన్నారు.

ఖమ్మంకలెక్టరేట్: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై లైంగికంగా దాడిచేసి దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు అధికారులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు మాట్లాడుతూ ఈ సంఘటన యావత్ దేశాన్ని చలించేలా చేసిందన్నారు. నిర్భయ సంఘటన కంటే దారుణమైన సంఘటన అని విచారం వ్యక్తం చేశారు. హాస్పటల్‌లోనే సెమినార్ హాల్లో నే ఈ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనను దేశం మెత్తం ముక్తకంఠంతో ఖండించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రవీణ్, డాక్టర్ తేజావత్ సురేష్, జూనియర్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





సత్తుపల్లి రింగ్‌సెంటర్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, ఖమ్మంలో నిరసన

డీఈఓ తనిఖీ

కామేపల్లి,ఆగస్ట్14: మండల పరిధిలోని కొమ్మినేపల్లి హైస్కూల్‌ను డీఈవో సోమశేఖర్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచిం చారు. ఈ తనిఖీలో నోడల్ అధికారి హెచ్ఎం జ్యోతి, డీఈఓ సెక్టరల్ అధికారి రామక్రిష్ణ పాల్గొన్నారు.

పోడుభూములకు పట్టాలివ్వాలి

కొణిజర్ల, ఆగస్టు14: మండలంలోని ఎల్లన్ననగర్ గ్రామంలో సమస్యలను పరిష్కరించి, పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఎల్లన్ననగర్ అటవీహక్కుల కమిటీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం వైరా క్యాంపాఫీస్‌లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వైరా వస్తున్న సీఎం రేంవత్‌రెడ్డిని కలిసి తమ సమస్యను చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవిహక్కుల కమిటి చైర్మన్ గుగులోతు లాల్‌సింగ్, కార్యదర్శి రాపోలు కృష్ణ, మాస్‌లైన్ నాయకులు గోగుల సోములు, రాప్స్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఇల్లెందుటౌన్, ఆగస్టు 14: చికిత్స కోసం వచ్చి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇల్లెందు ప్రభుత్వాశాలలో బుధవారం చోటుచేసుకుంది. ఈ విషయమై ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ వైద్యశాలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వచ్చిన వ్యక్తికి మూర్ఛకు సంబంధించిన వైద్యం నిర్వహించినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందతూ మృతి చెందాడని.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కాగా చనిపోయిన వ్యక్తికి సంబంధించిన వివరాల కోసం ఇల్లెందు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రీస్కూల్ హాజరు శాతం పెంచండి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 14: అంగన్‌వాడీ టీచర్లుతో ప్రీస్కూల్ సిలబస్ ప్రకారం కార్యక్రమాల నిర్వహణ, పిల్లల హాజరుశాతం పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కనక దుర్గ కోరారు. బుధవారం ఆమె ఆకస్మికంగా పట్టణంలోని మసీద్ రోడ్, పాలవాడ అంగన్‌వాడీ కేం ద్రాలను సందర్శించి యాప్ ప్రకారం పిల్లల హాజరు శా తం, స్టాక్, విద్యా బోధనను పరిశీలించారు. టీచర్లు, ఆ యాలు సమయపాలన పాటించాలని సూచించారు.

దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 14: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డిఎల్‌సిఈ) లో డిగ్రీ, పీజీ,డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 43 కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, అపరాధ రుసుము లేకుండా ఈనెల25 వరకు అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు పొందాలని పేర్కొన్నారు.

టీడీపీ పురోభివృద్ధిలో రామలక్ష్మణుల సేవలు మరువలేనివి

కొణిజర్ల,ఆగస్టు14: మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో టీడీపీని గ్రామం నుంచి రాష్ట్రస్థాయికి ఖ్యాతిని చాటిన వ్యక్తి తుప్పత్తి రామలక్ష్మణులు అని టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్ కొని యాడారు. బుధవారం గ్రామంలో జరిగిన రామలక్ష్మణులు సంస్మరణ సభలో మాట్లాడారు. టీడీపీ అభివృద్ధిలో వారి సేవలను మరువ లేమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యర్రాబాబు, పీవీరావు, ఏసు, యాసా సత్యనారాయణ, పసుమర్తి శంకర్‌రావు, తుప్పతి మల్లికార్జున్, యర్రా రామారావు, తుప్పతి బీరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాలకు జీపీఎస్

» నేటి నుంచి అమలులోకి

» కేఎంసీ పరిధిలోని 120 వాహనాలకు ఏర్పాటు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు 14: కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు లెవనేత్తిన పలు సమస్యలు పరిష్కారం దిశగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలు ప్రారంభించారు. గతకౌన్సిల్ సమావేశంలో పారిశుధ్య వాహనాల నిర్వాహణపై కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు సమస్యలను వివరించారు. రోజుకు రెండు ట్రిప్పులు వేయాల్సిన ట్రాక్టర్లు ఒకే ట్రిప్ వేస్తున్నారని, ఇంధనం లేదని చెపుతున్నారని తదితర అంశాలను ప్రశ్నించారు. దీంతో కేఎంసీలో పరిధిలో పారిశుధ్య పనులకు వినియోగిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ట్రాక్టర్లు, ఆటోలకు జీపీఎస్ (గ్లోబల్ పోజిషన్ సిస్టమ్)ను ఏర్పాటు చేసేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మొత్తం 120 వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుకు బుధవారం చర్యలను ప్రారంభించారు. గురువారం నుంచి ఈ వాహనాలు జీపీఎస్ నిఘా నీడలో రవాణా చేయనున్నాయి.


పారిశుధ్య ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసిన జీపీఎస్

భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదు

● ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, అగస్టు 14 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ అధికారులు తీసుకునే భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద హెలీప్యాడ్, పంప్‌హౌస్, డెలివరీ పాయింట్, ఇతర పరిసరాలలో భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్, పాల్వంచ డీఎస్పీ సతీస్‌కుమార్, ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, పాల్గొన్నారు.


సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

రైతులకు సకాలంలో సహకారం అందాలి: ఎమ్మెల్యే కోరం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందుటౌన్, ఆగస్టు 14: రైతులకు పంటలను పండించే కాలంతో పాటు అన్ని వేళల్లో తగిన విధంగా సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని గోవింద్ సెంటర్‌లో నూతనంగా ప్రాథమికి వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సోసైటీ నూతన భవనం, గోదాంలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల క్రిష్ణ, వైస్ చైర్మన్ పోలెపల్లి నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ ఆవుల కిరణ్, మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మండల రాము, ఈరాలాల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుష్ప్రభావాలపై జాగ్రత్త

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజ్‌గోపాల్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రాజ్‌గోపాల్

ఖమ్మంలీగల్/ ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు14: సోషల్ మీడియాతో దుష్ప్రభావాలు, ఉన్నాయని విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి రాజ్‌గోపాల్ అన్నారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం పలుఅభివృద్ధి కార్యక్ర మాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్య ఆవశ్యకతను వివరించారు, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ న్యాయపరమైన అవసరాలకు ఏం చెయ్యాలి అనేదానిపై విద్యార్థులకు వివరించారు. డిస్ట్రిక్ లీగల్ సెల్‌ను ఎలా సంప్రదించాలో సూచించారు. న్యాయఅవగాహన పుస్తకాలను కాలేజీ లైబ్రరీకి అందించారు. కొత్తన్యాయచట్టలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో రవి బాబు, ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ తాగునీటి శుద్ధీకరణ ప్లాంటు, ఉచిత ఏకరూప దుస్తులు వితరణ చేసిన కాళ్ల ఫౌండేషన్‌కి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

పాల్వంచటౌన్, అగస్టు 14 : పట్టణ పరిధి రాతి చెరువు బంజర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయోద్యమ నాయకులు వేషధారణలతో జాతీయ స్ఫూర్తిని రగిలించారు. బుధవారం పాఠశాల నుంచి జాతీయ జెండాను చేతబూని నాటి స్వాతంత్ర్య పోరాట యోదులైన మహాత్మాగాంధీ, సుబాష్‌చంద్ర బోస్, వల్లబాయ్‌పటేల్, ఆజాద్ చంద్రశేఖర్, నెహ్రూ, భారత మాత, ఝూన్సీ రాణీ రుద్రమదేవి, డాక్టర్ అంబేద్కర్‌ల వేషధారణలతో దమ్మపేట సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అచ్చమ్మ, సీనియర్ ఉపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు బాబూరావు, మాధవి, శ్రీను, సరళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వేషధారణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
గురువారం 15 ఆగస్టు 2024

ప్రజా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే



భద్రాచలం, ఆగస్టు 14: భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశోకనగర్ కొత్తకాలనీ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా గోదావరికి వరద వచ్చి తగ్గిన తర్వాత బ్లీచింగ్ చేయలేదని, విపరీతమైన దోమలు, విషపు పురుగులు తిరుగుతున్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడ బ్లీచింగ్ చల్లి దోమల మందు స్ప్రే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొడిశెట్టి కృష్ణమూర్తి, రత్నం రామాకాంత్, బొంబోతుల రాజీవ్, రత్నం రజనీకాంత్, అరికెల తిరుపతిరావు, నర్రా రాము, బి.వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, గాడి విజయ్, ఆకుల వెంకట్, పుల్లగిరి నాగేంద్ర, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

'సీతారామ' నీరు జిల్లాకు ఇవ్వాలి

బీఆర్ఎస్ ప్రదర్శన.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మణుగూరు, ఆగస్టు 14: పినపాక నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సీతారామ ప్రాజెక్టు సాగు నీరు జిల్లాలోని అన్ని మండలాలకు అందించిన తర్వాతే వేరే ప్రాంతాలకు మళ్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు నీరు జిల్లాలోని అన్ని మండలాలకు అందివ్వకుండా ఖమ్మం తరలించుకుపోతూ మంత్రుల ప్రయోజనాలకు ఉపయోగపడుతోందని ఆరోపించారు. స్థానిక రైతాంగానికి సాగు నీరు అందివ్వకపోవడం చాలా దుర్మార్గ చర్య అన్నారు. పూసుగూడెం సీఎం కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని తప్పకుండా అడ్డుకుంటామని తెలిపారు. అనంతరం డీటీ కృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఇల్లెందు నియోజకవర్గానికి అందించాలి

టేకులపల్లి: సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ డిమాండు చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇల్లెందు నియోజకవర్గానికి ఇవ్వాలని డిమాండు చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం టేకులపల్లి



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరిప్రియ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఒక గొప్ప భగీరథ ప్రయత్నాన్ని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మొదలు పెట్టాడని, కాని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు ఉన్నచోటికి తిరిగి గోదావరి జలాలను తరలిస్తూ కొత్తగూడెం జిల్లా నది పరివాహక ప్రాంతాలకు, ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించకుండా రైతులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇల్లెందుకు మంజూరు ప్రకటన ద్వారా జిల్లా రైతాంగానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బోడ బాలు నాయక్, మాజీ ఎంపీటీసీ అప్పారావు, బర్మావత్ శివకృష్ణ, బయ్యారం మాజీ వైస్‌ఎంపీపీ గణేష్, బీఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, బానోతు కిషన్ నాయక్, బానోతు రామా, తేజావత్ రవి, లాలునాయక్, ఇస్లావతు బాలు, కిరణ్‌కుమార్, గుగులోతు లక్ష్మా, బిక్షం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఎన్నో ఏళ్ల కల సాకారం

సీఎం సభకు భారీగా తరలిరండి: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాయం

మణుగూరు, ఆగస్టు 14: "ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం కల సాకారం అయ్యే తరుణం రానే వచ్చింది.. పినపాక నియోజకవర్గం గుండా గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం పొందబోతున్నారు.. పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు సాగునీటిని తెలంగాణా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించబోతున్నారు.. ఇది చరిత్రపుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ విషయం" అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మణుగూరులోని ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పినపాక నియోజవర్గంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ప్రారంభించడం తనకెంతో సతోషంగా ఉందన్నారు. రైతాంగం కూడా సంబరాలు చేసుకోబోతున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పూసుగూడెంలో ప్రాజెక్టు సాగునీటి ప్రారంభించి వైరాలో జరిగే సభలో రైతులనుద్దేశించి మాట్లాడనున్నారని తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సీతారామ ప్రాజెక్టు తొందరగా ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యేందుకు కృషి చేసిన డిప్యూటీ సీఎంకు, జిల్లా మంత్రులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు కృత జ్ఞతలు తెలిపారు. అలాగే అన్నమాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటుందని రైతులకు గురువారం రెండు లక్షల రూపాయల రుణ మాఫీ ప్రకటన సీఎం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తట్టుకో లేకే ప్రతిపక్షాల ఆందోళన

గురువారం ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీతారామ ప్రాజెక్టు చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేక ఆందోళనలు చేసి రైతులను ఇంకా గారడీ మాటలతో మభ్య పెట్టాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం విమర్శించారు. మిగులు పనులు పూర్తి చేసి ప్రారంభం చేయడం కరెక్టు కాదా.. అసత్య ప్రచారాలు, బురదజల్లే ప్రయత్నాలు చేయడం ప్రతిపక్షాలు పనిగా మారిందన్నారు. పూసుగూడెం వరకు గోదావరి జలాలు వెళ్లాయి.. ప్రజలు రైతులు గమనిస్తూనే ఉన్నారు.. సీతారామ ప్రాజెక్టు సాధన విషయంలో ప్రతి ఆందోళనలో తాను పాల్గొన్నానని ఎమ్మెల్యే పాయం తెలిపారు. దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ గుండాల మండలం దేవళ్లగూడెంలో పెట్టాలని కోరామన్నారు. దీంతో జిల్లా మొత్తం సాగు నీరు అందుతుందని నాడే దివంగత ముఖ్య మంత్రి వైఎస్ ఆర్‌కు చెప్పామన్నారు. డిజైన్లు మార్చి బీఆర్ఎస్ పెద్ద డిపిఆర్ తయారు చేసి డిజైన్లు మార్చి ఇప్పుడు మొసలికన్నీళ్ల రైతుల ముందు కార్చాడం శోచనీయమన్నారు. ఇది ముమ్మాటికీ అసత్య ప్రచారమే పాయం అన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



వినతిపత్రం అందజేస్తున్న 'మధ్యాహ్న' కార్మికులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. అశ్వారావుపేటలో బుధవారం ఆ సంఘ సమావేశం నాయకులు యామిని అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళ నిర్వహించి, కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీత, నాగదుర్గ, చిలకమ్మ, విజయకుమారి, సన్ని, కనక, పద్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ జరగాలి: ఎమ్మెల్యే

దుమ్ముగూడెం, ఆగస్టు 14: అర్హత గల ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ జరగాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. దుమ్ముగూడెం సొసైటీలో బుధవారం మాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలనందించారు. దుమ్ముగూడెం సొసైటీ పరిధిలో రెండు విడతల్లో సుమారు రెండువేల మంది రైతులకు రూ7.73కోట్ల రుణమాఫీ లభించిందన్నారు. రుణమాఫీలో తలెత్తిన సాంకేతిక సమస్యలను వ్యవసాయశాఖ, బ్యాంకు మేనేజర్లు కలిసి పరిష్కరించాలని సూచించారు. బ్యాంకులు ఏ ఇతర అప్పులను మినహాయించకుండా, మంజూరైన మొత్తాన్ని రైతులకందించాలన్నారు. అడంగల్ మీద తీసుకున్న రుణాలకు సైతం మాఫీ వర్తింపజేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ ఎమ్మెల్యేకు వినతిపత్రమందజేయగా, సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. క్రీడా మైదానం అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, విద్యార్థుల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను మంజూరు చేయించాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి అభ్యర్థించగా, సమకూర్చే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీసీసీబీ ఏజీఎం ప్రవీణ్, మేనేజర్ త్రిమూర్తులు, సొసైటీ చైర్మన్ ఎల్లారెడ్డి, డైరెక్టర్లు వెంకట్రావు, సూర్య చంద్ర రావు, శ్రీనుబాబు, పూర్ణయ్య, వెంకటేష్, సీఈఓ హిమబిందు పాల్గొన్నారు.



ఓచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

మీసేవా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ అశోక్

దుమ్ముగూడెం, ఆగస్టు 14: మండలంలోని లక్ష్మీనగరం, ములకపాడు, కాటాయిగూడెం మీ సేవా కేంద్రాలను తహసీల్దార్ అశోక్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత ధరలకు మించి వినియోగదారుల నుంచి అధిక రుసుం వసూలు చేయవద్దని హెచ్చరించారు. మీ సేవా కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటిని ఏర్పాటు చేయాలని, సేవా ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సోదరుల కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, ఆగస్టు 14: రెండు వారాల క్రితం దమ్మపేట మండలం, జమేదారు బంజర్‌కు చెందిన సోదరులు బొర్ర చందు, బొర్ర సిద్దులు పిడుగుపాటికి గురై మృతి చెందారు. ఈ సోదరుల తల్లి తండ్రులు మల్లేష్-నాగమణీలకు బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వారి ఇంటికెళ్ళి ఒక్కొక్కరికి యాభైవేల చొప్పున, లక్ష రూపాయల చెక్కును అందజేసారు. అనంతరం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జెండా ప్రాముఖ్యత తెలియాలి: డీఈవో

చుంచుపల్లి, ఆగస్టు 14: విద్యార్థులకు జాతీయ జెండా ప్రాముఖ్యత తెలియజేయాలని డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. బుధవారం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గతంలో నాటిన 150 మొక్కలను వాటి సంరక్షించిన విధానాన్ని పరిశీలించారు. నాటిన అన్ని చెట్లను కాపాడినందున విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం హర్ ఘర్ తిరంగ లో భాగంగా విద్యార్థులకు జాతీయ జెండాలను అందించారు. అనంతరం దేశభక్తితో దేశ అభ్యున్నతికై ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రభుదయాల్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ..

హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ ఎన్‌సీసీ క్యాడెట్లు ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఆనందఖని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యాశాఖ అధికారి బి.జుంకీలాల్ విచ్చేసి జెండా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ విద్యార్థి జెండా ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆయన కోరారు. స్వాతంత్ర సమర యోధుల యొక్క గొప్పతనాన్ని ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి.వీరునాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ప్రాముఖ్యతను వివరిస్తున్న డీఈవో

బంగ్లాదేశ్ ఘటనపై ఆందోళనలు



మణుగూరులో న్యాయవాదుల నిరసన

మణుగూరు, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు మణుగూరు కోర్టు బార్ అసోసియేషన్ బుధవారం నిరసన తెలిపింది. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు హిందూ సంఘాలు పట్టణంలో సాయంత్రం ప్రదర్శన చేపట్టి టీడీపీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న నరమేధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు తెలిపారు.

గుండాలలో బంద్..

గుండాల: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో బంద్ విజయవంతం అయింది. మండల కేంద్రంలోని హోటళ్లు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేశాయి. అనంతరం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఇల్లెందులో బంద్ విజయవంతం

ఇల్లెందుటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్య వేదిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇల్లెందులో చేపట్టిన బంద్ విజయవంతమైంది. బంద్ సందర్భంగా హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఇల్లెందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొల్లి సంజీవరెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్ సంక్షోభంలో సంబంధం లేని హిందువులపై దాడులు చేస్తూ విధ్వంసాలకు పాల్పడుతున్నారని నిరసించారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు మాధవ్, రామయ్య, రామచందర్, గోపి, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

'తుమ్మలను విమర్శించే అర్హతలేదు'

దమ్మపేట, ఆగస్టు 14: జిల్లాలోనే కాక ఉమ్మడి రాష్ట్రంలోనే అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందిన తుమ్మల నాగేశ్వరరావును విమర్శించే కనీస అర్హత హరీష్‌రావుకు లేదని దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కాసాని నాగ ప్రసాద్, కేవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడు తుమ్మల నాగేశ్వరరావు తన వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయం చేయలేదన్నారు. ప్రతి నిత్యం అభివృద్ధి కోసమే ఆలోచిస్తుంటారని, అలాంటి వ్యక్తిపై హరీష్‌రావు అసత్యపు మాటలు మాట్లాడటం తగదన్నారు. ఇకముందు అలాంటి మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, ఉపేంద్రబాబు, కొయ్యల అచ్యుతరావు, ఎల్లిన రాఘవరావు, ఎర్ర వసంతరావు, కక్కిరాల రమేష్, వై.రాధాకృష్ణ, మన్నె అప్పారావు, దొడ్డ ప్రసాద్, ఇస్లావత్ శ్రీను, బొల్లికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంప్‌హౌస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం

అశ్వాపురం, ఆగస్టు 14: మండల పరిధిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన గురువారం ఉన్న నేపథ్యంలో అశ్వాపురం మండల పరిధిలోని బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్టు మొదటి పంపుహౌజ్‌ను బుధవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ములకలపల్లి మండలం పూసుగూడెంలో రెండో పంపుహౌజ్ ప్రారంభించనున్నారు. ఈ నేపధ్యంలో బీజీ కొత్తూరులోని మొదటి పంపుహౌజ్‌ను డిప్యూటి సీఎం భట్టివిక్రమార్క సందర్శించి అధికారికంగా ప్రారంభించనున్నారు. దీంతో అన్ని ఏర్పాట్లును పూర్తి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పర్యటన సంద ర్భంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని వారు అధికారులను ఆదేశిం చారు. పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చూసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పీవో రాహుల్, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, తహసీల్దార్ స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పాల్గొన్నారు.



పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ముత్యాలమ్మ తల్లికి అభిషేకం

గుండాల, ఆగస్టు 14: శ్రావణమాసపు బోనాల నేపధ్యంలో బుధవారం గుండాల మండల కేంద్రంలో ముత్యాలమ్మ తల్లికి, బొడ్రాయి దేవతలకు ప్రత్యక పూజలు చేశారు. తిరుకొవళ్లూరి వెంకటేశ్వర్లు- హరిప్రియ దంపతుల ఆధ్వర్యంలో బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి దేవతలకు అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకం, అర్చన, అష్టోత్తర శతనామ పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, ఆగస్టు 14: దమ్మపేట మండలంలో బుధవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల బస్ పాస్‌ల మేళాను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించే భాగంగా ప్రత్యేకంగా మేళాను ఏర్పాటు చేసి దివ్యాంగులకు బస్ పాస్‌లను ఎమ్మెల్యే చేతులమీదుగ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'పాలకవర్గ సభ్యుల సేవలు మరువలేనివి'

కరకగూడెం, ఆగస్టు 14: మారుమూల ఏజెన్సీ మండలంలోని గ్రామాలలో ఎంపీపీ రేగా కాళిక, జడ్పీటీసీ కొమరం కాంతారావు, కో ఆప్షన్ సభ్యులు సోందుపాషా, పంచాయితీ కార్యదర్శుల సేవలు మరువలేనివని జిల్లా మైనింగ్ డీఈ, మండల ప్రత్యేక అధికారి దినేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్ అన్నారు. బుధవారం భట్టుపల్లి పంచాయితీలోని రైతు వేదికలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఎంపీపీ, జడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, బదిలీపై వెళ్తున్న పంచాయితీ కార్యదర్శులకు ఆత్మీయ సన్మానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ఏజెన్సీ గ్రామాలలో అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పదవి, ఉద్యోగ విరమణ అనేది ఎప్పటికి ఉంటుందని ప్రజలకు సేవ చేయడానికి పదవులు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు శ్యాం సుందర్, తరుణ్, మధు, శ్రీకాంత్, శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం పెట్టాలి: తహసీల్దార్

కరకగూడెం, ఆగస్టు 14: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన వంటలను వండి పెట్టాలని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ కోరారు. బుధవారం చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ నాగ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించిన ఆయన విద్యార్థులకు వడ్డిస్తున్న వంటకాలను పరిశీలించారు. కూరలో ఉప్పు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఎలా తింటారని కుక్‌లను నిలదీశారు. అనంతరం పాఠశాల విద్యార్థుల వివరాలు, మెనూ వివరాలను పాఠశాల హెచ్ఎం నాగేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులపై ఐటీడీఏ పీవోకు తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు రుచికరమైన వంటలతో పాటు, అర్థమయ్యేలా బోధించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమయపాలన పాటించని వారి గురించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోవడంతో జరుగుతుందని హెచ్చరించారు.



వంటలను రుచిచూస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్